సాక్షి
ములుగు
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



తరగతుల బహిష్కరణ
విద్యార్థి సంఘాల బాధ్యులపై అక్రమ కేసులను నిరసిస్తూ శనివారం కేయూలోని వివిధ విభాగాల్లో తరగతులను బహిష్కరించారు. - 8లో▸

పొదుపు పథకాలపై..
చిన్న మొత్తాల పొదుపుపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ పెంచింది. వడ్డీ రేట్ల పెంపుతోపాటు ఎంపిక చేసిన పొదుపు ఖాతాలకు అత్యధిక పొదుపు పరిధిని సవరించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34°/23°
వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

జాగ్రత్తలు తీసుకోవాలి



ములుగు: ఆరోగ్య మహిళ పథకంలో భాగంగా జిల్లాలోని రొయ్యూరు పీహెచ్‌సీ నుంచి రెఫర్ చేసిన హరిత, నాగలక్ష్మీ, అశ్విని , మమతలకు డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య తగిన సలహాలు, సూచనలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో స్పెషలిస్టు గైనకాలజిస్టుతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి స్కానింగ్ చేశారు. ఏడుగురిలో ఇద్దరు సంతానలేమితో ఉన్నట్లుగా గుర్తించామని అప్పయ్య తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళల వివరాలను సంబంధిత ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

నియామకం ఎప్పుడు..?



మంగపేట: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రాంమూర్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం మాలమహానాడు ముఖ్య నాయకుల సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు రాజమళ్ల సుకుమార్ అధ్యక్షతన జరిగిందిళ్లీ సందర్భంగా రాంమూర్తి మాట్లాడుతూ 2015నుంచి ఇప్పటి వరకు కమిషన్ ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో పిటిషన్లు విచారణకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దళితబంధు ఏకకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు తాలూకా సంపత్, మండల అధ్యక్షుడు మైప లాలయ్య, బోడ రాంచందర్, దాసరి ఎల్లయ్య, రొడ్డ భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

వృత్తిలో రాణించాలంటే శిక్షణ ముఖ్యం



మంగపేట: వృత్తిపరంగా అభివృద్ధి చెందాలంటే శిక్షణ ఎంతో ముఖ్యమని మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీపతి అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో శనివారం అకినేపల్లిమల్లారం గోదావరిలో వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అకినేపల్లిమల్లారం, దోమెడ, గంపోనిగూడెం, బ్రాహ్మణపల్లి, పెరకలకుంట గ్రామాల్లో గతంలో మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మత్స్య సంఘాలకు ఉచితంగా చేప పిల్లలు, వలలు, తెప్పలు, 75 శాతం రాయితీతో శీతలీకరణ వాహనాలు, సైకిళ్లు, మోటారు సైకిళ్లు తదితర యంత్రాలతో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, మత్స్యశాఖ క్షేత్ర అధికారి రమేష్, సిబ్బంది భూక్య కృష్ణ, వివిధ గ్రామాల పెసా మొబిలైజర్ల మండల అధ్యక్షుడు, డబ్బుల ముత్యాలరావు, మొబిలైజర్లు మేకల నర్సింహారావు, చెన్నారావు, ఆది పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ క్లస్టర్ వేదికగా నేడు (శనివారం) జరుగనున్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కోరారు. ఈ సందర్భంగా రేగొండ మండలంలోని పలు గ్రామాలలో కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సాయిని విజయ, బీఆర్‌ఎస్ పార్టీ రేగొండ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్‌రావు, పగడాల ఐలయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీలో.. ఆ ముగ్గురు

ముఖ్యమంత్రి పేషీకి చేరిన ఫిర్యాదులు
- అధికారిక వాహనాల దుర్వినియోగం
- పైరవీల కోసం నిత్యం హైదరాబాద్‌కు
- ఓ మంత్రికి బంధువునని బెదిరింపు
- వివాదాస్పదంగా కొందరు అధికారుల తీరు



సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ ఆర్టీసీ రీజియన్‌లో ముగ్గురు అధికారులపై సీఎం పేషీకి వెళ్లిన ఫిర్యాదులు కలకలం రేపుతున్నాయి. ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన వీసీ సజ్జనార్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి సంస్థ పురోగతికి కృషి చేస్తుండగా.. కొందరు అధికారుల తీరు వివాదాస్పదమవుతోంది. అధికారిక వాహనాలను తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకుంటూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు కొందరు అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్తూ.. వాహనాలకు టోల్‌గేట్ల వద్ద చెల్లించిన పన్నుల రశీదులు వైరల్ అవుతున్నాయి. సీఎం పేషీలో చేసిన ఫిర్యాదు ఆధారంగా ఆర్టీసీ విజిలెన్స్, ఇంటెలిజెన్స్‌లు వేర్వేరుగా విచారణ జరుపుతుండడం చర్చనీయాంశంగా మారింది.

రంగంలోకి నిఘా విభాగాలు..
సీఎం పేషీకి చేరిన ఫిర్యాదుపై విచారణకు నిఘా విభాగాలు రంగంలోకి దిగాయి. ఓవైపు ఆర్టీసీ విజిలెన్స్, మరోవైపు ఇంటెలిజెన్స్‌లు ఆరా తీస్తున్నాయి. కొందరు అధికారులు అద్దె బస్సుల నిర్వాహకుల నుంచి ఒక్కో బస్సుకు నెలకు రూ.వేయి చొప్పున వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై విచారిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు ఆర్టీసీ అధికారులు ఢిల్లీ నుంచి పరిచయం ఉన్న ఓ వ్యక్తితో ఇలా చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలపైనా విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా ఉద్యోగులు, సిబ్బంది, అద్దెబస్సుల నిర్వాహకుల పట్ల నిబంధనల ప్రకారం నిక్కచ్చిగా వ్యవహరించడం మూలంగా సదరు అధికారులపై కొందరు సీఎం పేషీలో ఫిర్యాదు చేశారన్న మరో వాదన వినిపిస్తోంది.

బదిలీల కోసం పైరవీలు..
ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న కొందరిపై ఫిర్యాదు చేశారు.
- బదిలీ స్థానాల్లో పని చేయకుండా తాము కోరుకున్న చోటకు వెళ్లేందుకు హైదరాబాద్‌కు అధికారిక వాహనాల్లో వెళ్లి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు పేర్కొన్నారు.
- వరంగల్, హైదరాబాద్‌లకు తిరుగుతున్నట్లు చెబుతున్నారు.
- ఓ డిపో మేనేజర్ పదోన్నతికి ముందు మెకానికల్ ఫోర్‌మెన్ (ఎంఎఫ్)గా పనిచేసిన జిల్లాకు వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నారని, ఇదే సమయంలో ఆ జిల్లాకు చెందిన ఓ మంత్రికి బంధువునని చెప్పి కిందిస్థాయి సిబ్బందిని బెదిరింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
- డిప్యూటీ ఆర్ఎంగా ఉన్న ఓ అధికారి కూడా అధికారిక వాహనాన్ని దుర్వినియోగం చేస్తూ నిత్యం హైదరాబాద్‌కు వెళ్లి వస్తున్నారని ఆరోపించారు.
- అద్దెబస్సుల నిర్వాహకుల నుంచి ఒక్కో బస్సుకు నెలకు రూ.వెయ్యి వసూలు చేస్తున్నారని తెలిసింది.

'బలగం' మొగిలయ్యను పరీక్షించిన
ఎంజీఎం వైద్యబృందం

సాక్షి కథనానికి స్పందించిన మంత్రి హరీశ్‌రావు
- సంరక్ష ఆస్పత్రికి వెళ్లిన డాక్టర్లు
- డయాలసిస్ తీరు పరిశీలన
- అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామని హామీ



మొగిలయ్యను పరామర్శిస్తున్న ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యబృందం

కాశిబుగ్గ: వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న 'బలగం'సినిమాలో నటించి, పాటతో మెప్పించిన మొగిలయ్యను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని వైద్యబృందం శనివారం పరామర్శించింది. మొగిలయ్య దీన పరిస్థితిపై 'సాక్షి'లో ఇటీవల 'ఆపదలో ఉన్నాం.. తోడుగా నిలవండి'శీర్షికన ప్రచురితమైన మానవీయ కథనానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పందించారు. మొగిలయ్యకు ప్రభుత్వం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని వైద్యబృందం, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ నాయక్‌లు సంరక్ష ఆస్పత్రికి చేరుకొని మొగిలయ్యను పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్యసేవల గురించి ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మొగిలయ్య గత సెప్టెంబర్ నుంచి రెండు కిడ్నీలు పూర్తిగా పాడై ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ చికిత్స పొందుతున్నాడని, ఇటీవల బీపీ, షుగర్ పెరిగి కంటి సమస్యతో బాధపడుతున్నాడని తెలిపారు.



సాక్షిలో ప్రచురితమైన కథనం

ఇక్కడ వైద్యసేవలు బాగానే ఉన్నాయని, రోజూ దుగ్గొండి నుంచి రావాలంటే బస్సులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని మొగిలయ్య భార్య కొమురమ్మ తెలిపినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. వచ్చివెళ్లేందుకు అంబులెన్స్ కూడా ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి మొగిలయ్యకు మంచి వైద్యసేవలు అందుతున్నాయని, మరేమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని, వారి రక్షణకు తెలంగాణ ప్రభుత్వం, తాము సిద్ధంగా ఉన్నామని మొగిలయ్య దంపతులకు సూపరింటెండెంట్ సూచించారు. సూపరింటెండెంట్ వెంట సంరక్ష వైద్యులు డాక్టర్లు మల్లేష్, దినేష్, సంరక్ష ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు నటరాజ్, భాస్కర్ ఉన్నారు.

చెరువులు, కాల్వలకు మరమ్మతు చేపట్టాలి

- కలెక్టర్ కృష్ణ ఆదిత్య



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగు: జిల్లాలో ప్రధానంగా ఉన్న చెరువులు, కాల్వల మరమ్మతు పనులలో వేగం పెంచాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య సూచించారు. ఈ మేరకు తన చాంబర్‌లో నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన సోమయ్య చెరువు, వట్టిగూడెం, సింగరకుంటపల్లి, జిన్నెల చెరువు పనులను నెలాఖరులోగా పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందేలా చూడాలన్నారు. దీంతో పాటు ములుగు మండలంలో ఒకటి, వెంకటాపురం(ఎం) మండలంలో రెండు, గోవిందరావుపేట మండలంలోని రెండు, ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని ఐదు చెరువులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి ఐదో తేదీలోగా అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇరిగేషన్ అధికారి బాబురావు, ఈఈ వెంకట కృష్ణరావు, జగదీశ్వర్ పాల్గొన్నారు.

పోడు పట్టాలిచ్చే వరకూ పోరాటం

- ములుగు ఎమ్మెల్యే సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు: పోడు భూములకు పట్టాలు ఇచ్చేంతవరకూ పోరాటం చేస్తామని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎనిమిదేళ్ల పాలనలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తానని చెప్పి సీఎం కేసీఆర్ మాటతప్పుతూనే ఉన్నారని అన్నారు. స్వంత ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు ఇస్తామని గొప్పలు చెప్పుకొని ఇప్పటి వరకు మార్గదర్శకాలు విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కష్టపడి చదువుతున్న యువత ఉద్యోగాలు రాక బలాన్మరణాలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులను రాజును చేయడమే లక్ష్యంగా ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, అక్తర్‌పాషా, ఆకుతోట చంద్రమౌళి, శ్రీనివాస్, జెడ్పీటీసీ కరన్ చంద్‌గాంధీ, పీఏసీఎస్ చైర్మన్ సత్తిరెడ్డి, మద్రి రాజు, కంబాల రవి, రేవంత్‌యాదవ్, తిరుపతి, మావురపు తిరుపతిరెడ్డి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- జిల్లాలో 20పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 3,651మంది విద్యార్థులు
- పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- రేపటి నుంచే టెన్త్ పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఈనెల 3వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ భవేష్‌మిశ్రా ఇప్పటికే విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ప్రశ్నపత్రాలను జిల్లాకేంద్రంలోని స్ట్రాంగ్‌రూంలో ఉంచి ఇక్కడి నుంచి మండల కేంద్రాలకు పంపించి పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఉదయం 8.30గంటల నుంచే పరీక్ష హాల్లోకి అనుమతిస్తారు. జిల్లాలోని 11 మండలాల్లో 115 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉండగా జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలలో ఈ పరీక్షకు 3,651మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. సబ్జెక్టుకు ఒక పేపర్‌తోనే పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో పేపర్‌-1, పేపర్‌-2 లు ఉండేవి.

230 మంది ఇన్విజిలేటర్లు..
జిల్లాలోని 20పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు 230మంది ఇన్విజిలేటర్లు, 20మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 20 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, కేంద్రాల్లో సిట్టింగ్‌స్క్వాడ్‌లను నియమించారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు సైతం తనిఖీచేసే అవకాశం ఉంది.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ

సీసీ కెమెరాల ఏర్పాటు..
కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష ప్రశ్నపత్రాలను తెరవనున్నారు. ఇన్విజిలేటర్లకు సెల్‌ఫోన్ అనుమతి లేదు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు ఏర్పాటు చేశారు. డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. పరీక్షలపై ఎటువంటి సందేశాలు ఉన్నా జిల్లా ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి జుమ్మునాయక్ 99519 46418లకు, హెల్ప్‌లైన్ నంబర్ 98854 62305లకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్‌చేసే అవకాశం కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించారు.

విద్యార్థులు పాటించాల్సిన అంశాలు..
- పరీక్ష కేంద్రానికి యూనిఫాంతో రాకూడదు.
- సిక్స్ ప్యాకెట్ జీన్స్, షూ ధరించి రాకూడదు.
- పరీక్ష సమయానికి ఒక గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.
- సెల్‌ఫోన్స్, క్యాలికిలేటర్లు ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలను తీసుకురావద్దు.
- ఎటువంటి ఒత్తిడికి గురి కాకూడదు.
- చివరి నిమిషంలో అనవసర హడావిడి పడవద్దు.
- బంధువులు, స్నేహితులను పరీక్ష కేంద్రాల వద్దకు తీసుకురావద్దు.
- పుస్తకాలను పరీక్ష కేంద్రం వద్దకు తీసుకురావద్దు.
- రెడ్ పెన్ను వాడకూడదు. హాల్‌టికెట్ మినహాయించి ఇతర పేపర్లు వెంటతీసుకురావద్దు.
- పరీక్ష ప్యాడ్ తప్పనిసరిగా తీసుకురావాలి.

ఏర్పాట్లు పూర్తి చేశాం..
జిల్లాలో పదోతరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బందిని నియమించి పరీక్ష నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యల గురించి ఆదేశాలు జారీచేశాం. విద్యార్థులు, మాల్‌ప్రాక్టీస్, మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకుంటాం. ఇన్విజిలేటర్‌లు మాస్‌కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తాం.
- రాంకుమార్, ఇన్‌చార్జ్ డీఈఓ

ప్రణాళికతో ముందుకెళ్లాలి



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ములుగు: సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు ప్రణాళికతో ముందుకెళ్లాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సూచించారు. ఆయా శాఖల అధికారులతో శనివారం జరిగిన స్థాయీ సంఘాల సమావేశాలకు నాగజ్యోతి అధ్యక్షత వహించారు. మల్లంపల్లి గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయితీ పురస్కారం రావడంపై సంతోషం వ్యక్తంచేస్తూ డీపీఓ కొండా వెంకయ్యను అభినందించారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలకు అదనపు ఆదాయం చేకూర్చేలా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గొర్రెల లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు కానున్నట్లు తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటే సమీపంలోని ఆస్పత్రికి రెఫర్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు సకినాల భవాని, పాయం రమణ, రుద్రమాదేవి, కరణ్‌చంద్‌గాంధీ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, రియాజ్ మిర్జా, గనుల శాఖ అధికారి రామాచారి, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డీసీఓ సర్దార్‌సింగ్, డీఆర్‌డీఓ నాగ పద్మజ, పశు సంవర్ధక శాఖ అధికారి విజయభాస్కర్, జెడ్పీ సీఈఓ ప్రసూన రాణి, డిప్యూటీ సీఈఓ రమాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ సవరణకు ఆధారం తప్పనిసరి

భూపాలపల్లి: ఆధార్‌కార్డు సవరణకు ఆధారం తప్పనిసరిగా అందజేయాలని జిల్లా ఈడీఎం శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ మనిషికి ఆధార్ కార్డు ఉండాలని నిబంధన విధించాయని, కార్డు ఉంటేనే లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మంజూరు, భూముల రిజిస్ట్రేషన్, బ్యాంక్ పాస్‌బుక్, ఉపాధి హామీ పనులు లభిస్తాయని వెల్లడించారు. పేరులో మార్పు చేయాలంటే తప్పనిసరిగా ఫొటో ఉన్న ధృవపత్రం సమర్పించాలని సూచించారు. ఆధార్ కార్డు అప్‌డేట్ పేరుతో జరిగే మోసాలను అరికట్టేందుకు తాజాగా యుఐడీఏఐ జారీచేసిన ఆదేశాలను ఆధార్ కేంద్రాల వారు పాటించాలన్నారు. ప్రజలు నిబంధనల ప్రకారం సరైన ధృవపత్రాలు తీసుకొని అప్‌డేట్ చేసుకోవాలన్నారు. మార్పు ఒక్కసారే చేసుకునే వీలుందని, గతంలో మాదిరిగా మళ్లీ మళ్లీ మార్చుకునే వీలు లేదని శ్రీకాంత్ తెలిపారు.

ప్రయాణికులపై టోల్ భారం


- హైదరాబాద్‌కు పెరిగిన ఆర్టీసీ చార్జీలు

హన్మకొండ: హైదరాబాద్-హనుమకొండ రూట్‌లో, అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ప్రయాణించే ఆర్టీసీ ప్రయాణికులపై టోల్‌భారం పడింది. దేశవ్యాప్తంగా పెంచిన టోల్ చార్జీలు శనివారం నుంచి అమల్లోకి రావడంతో అందుకనుగుణంగా టీఎస్ ఆర్టీసీ కూడా టికెట్ ధరలు పెంచింది. వరంగల్ రీజియన్ ప్రస్తుతానికి రోజూ రూ.4,00,100 టోల్ చార్జీలు చెల్లిస్తూ వస్తోంది. టోల్‌చార్జీల పెంపుతో సంస్థపై అదనంగా రోజుకు రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు భారం పడుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు హైదరాబాద్ రూట్‌లో రూ.10 చొప్పున బస్ చార్జీలను పెంచారు. ఈ చార్జీలు హనుమకొండ-హైదరాబాద్‌తోపాటు అంతర్ రాష్ట్ర సర్వీస్‌లపై వర్తిస్తాయని అధికారులు తెలిపారు. ఇతర రూట్‌లలో చార్జీలు పెంచలేదని స్పష్టం చేశారు.


హనుమకొండ-హైదరాబాద్ రూట్‌లో చార్జీల వివరాలు

సర్వీస్	పాతవి	కొత్తవి
గరుడ	420	430
రాజధాని	360	370
సూపర్ లగ్జరీ	270	280
డీలక్స్	240	250
ఎక్స్‌ప్రెస్	190	200 (ఉప్పల్‌కు)
ఎక్స్‌ప్రెస్	200	210 (ఎంజీబీఎస్‌కు)
పల్లె వెలుగు	150	160

రామప్పను సందర్శించిన ఎమ్మెల్సీ



రామప్పను సందర్శించిన ఎమ్మెల్సీ లక్ష్మినారాయణ కుటుంబం



రామప్పను సందర్శించిన అల్లం నారాయణ

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని శనివారం ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ కుటుంబ సమేతంగా సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరుడిని దర్శించుకోగా, టూరిజం గైడ్ విజయ్ కుమార్ ఆలయ విశిష్టతను వివరించారు. రామప్ప శిల్పకలా సంపద బాగుందని కొనియాడారు.

అల్లం నారాయణ సందర్శన..
రామప్ప ఆలయాన్ని శనివారం సాయంత్రం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా రామప్ప రామలింగేశ్వర స్వామికి ఆయన పూజలు నిర్వహించగా ఆలయ అర్చకుడు హరీశ్ శర్మ తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ వెంకటేష్ వివరించగా రామప్ప శిల్పకళ అద్భుతమని, నాటి నాగరికత, సంస్కృతి, చరిత్రను శిల్పాల ద్వారా అద్భుతంగా చూపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్, రాష్ట్ర నాయకులు రాజ్ నారాయణ, అల్లం హరి తదితరులు ఉన్నారు.

భూ క్రమబద్ధీకరణకు 30వరకు గడువు

భూపాలపల్లి: జిల్లాలో జీవో నంబర్ 58, 59 ద్వారా అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు మీ సేవా ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 58, 59 ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు 2014 జూన్ 2 కటాఫ్ తేదీ ఉండగా, దానిని 2020 జూన్ 2కు పొడిగిస్తూ ప్రభుత్వం గత నెల 17వ తారీఖున ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

క్లుప్తంగా

భార్యను కొట్టిన భర్తపై కేసు నమోదు

ఖిలా వరంగల్: మద్యం తాగి భార్యను కొట్టిన భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ దసరా రోడ్డుకు చెందిన మంద సరిత, భర్త శివకుమార్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివకుమార్ మెడికల్ రిప్రజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇంటికి వచ్చే సమయాన ఫుల్‌గా మద్యం తాగి వచ్చి భార్య సరితను తీవ్రంగా కొడుతున్నాడు. రోజు వారీగానే శనివారం సాయంత్రం 7.30 గంటలకు శివకుమార్ మద్యం తాగి ఇంటికి చేరుకున్నాడు. భార్య సరితతో గొడవ పడి కొట్టగా చేతికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో సరిత ఫిర్యాదు మేరకు శివకుమార్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరెస్ట్



వరంగల్ క్రైం: ఏటీఎం సెంటర్లలో మాటు వేసి అమాయకులను టార్గెట్ చేసుకుని కార్డులు మార్చేసి డబ్బులు డ్రా చేస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారుతెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన పుల్ల ప్రభాకర్ (28) మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈక్రమంలో ప్రభాకర్ ఏటీఎం సెంటర్లలో మాటు వేసి ఆమాయకులకు సాయం చేసినట్లు నటిస్తూ పిన్ కోడ్‌ను తెలుసుకుని కార్డు మార్చి వారి ఖాతాల్లోని డబ్బులు మాయం చేస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం ప్రభాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పొదుపు పథకాలపై పెరిగిన వడ్డీ



- చిన్నమొత్తాల పొదుపులకు అవకాశం
- తపాలాశాఖలో అనేక పొదుపు పథకాలు

హన్మకొండ: చిన్న మొత్తాల పొదుపుపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ పెంచింది. చిన్న మొత్తాల పొదుపుపై 2023–24 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికిగాను తపాలాశాఖ వడ్డీ రేట్లు పెంచింది. 2023 ఏప్రిల్ నుంచి జూన్ వరకు పెరిగిన వడ్డీ రేట్లు వర్తిస్తాయి. వడ్డీ రేట్ల పెంపుతోపాటు ఎంపిక చేసిన పొదుపు ఖాతాలకు అత్యధిక పొదుపు పరిధిని సవరించారు. సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో అత్యధిక పొదుపుని రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచారు. ఈ స్కీంలో మూడు నెలలకోసారి 8శాతం వడ్డీ పొందవచ్చు. మంత్లీ ఇన్‌కమ్ స్కీంలో వ్యక్తిగత ఖాతాలో అత్యధిక పొదుపుని రూ.4.5లక్షల నుంచి రూ.9లక్షలకు, జాయింట్ ఖాతాలో అత్యధిక పొదుపుని రూ.9లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచారు. ఈ స్కీంలో నెలకు ఒకసారి 6.7 శాతం వడ్డీ పొందవచ్చు. మహిళా సమ్మాన్ బచత్ పత్ర పేరుతో ఒక కొత్త స్కీంను మహిళలు, ఆడ పిల్లల కోసం వన్ టైం స్మాల్ సేవింగ్ స్కీంగా ప్రవేశపెట్టారు. ఈ స్కీంలో మార్చి–2025 వరకు చేరవచ్చు. ఇందులో అత్యధికంగా రూ.2లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చు. కాల పరిమితి 2 సంవత్సరాలు కాగా, వడ్డీ 7.5శాతంగా నిర్ణయించారు. పాక్షిక నగదు ఉపసంహరణకు కూడా అవకాశం కల్పించారు.

వడ్డీ వివరాలు..

పొదుపు ఖాతా	వడ్డీ
సేవింగ్స్ అకౌంట్	4 శాతం
రికరింగ్ డిపాజిట్	6.2
మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్	7.4
టైమ్ డిపాజిట్ ఒక సంవత్సరం	6.8
టైమ్ డిపాజిట్ 2 సంవత్సరాలు	6.9
టైమ్ డిపాజిట్ 3 సంవత్సరాలు	7
టైమ్ డిపాజిట్ 5 సంవత్సరాలు	7.5
సుకన్య సమృద్ధి ఖాతా	8
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.1
సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్	8.2
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.7
కిసాన్ వికాస్ పత్ర 115 నెలలు	7.5

పథకాల్లో చేరి అధిక వడ్డీ పొందండి



“తపాలా శాఖ పొదుపు పథకాలపై పెంచిన వడ్డీ సౌకర్యాన్ని ఖాతాదారులు అందిపుచ్చుకోవాలి. మూడు నెలల కాలానికి వడ్డీ రేట్లు పెంచాం. అదే విధంగా పొదుపు చేసే మొత్తాన్ని కూడా పెంచాం. ఏ ఇతర బ్యాంకుల్లో లేని విధంగా అత్యధిక వడ్డీ రేటు తపాలా శాఖ పొదుపు ఖాతాలపై చెల్లిస్తుంది.

- బానోతు నందా, తపాలా సూపరింటెండెంట్, హనుమకొండ డివిజన్

ఆకతాయిలను పట్టుకున్న షీ టీం బృందం

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్‌లోని కాకతీయ జూపార్క్‌లో అమ్మాయిలు, మహిళలను ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న షీ టీం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రెక్కి నిర్వహించి పది మందిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం షీ టీం పనిచేస్తుందన్నారు. ఎలాంటి సమయాల్లోనైనా మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాట్సాప్, ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్, సామాజిక మధ్యమాల్లో మహిళపై అసభ్యకరంగా, గౌరవానికి భంగం కలిగించే వారిపై చర్యలు ఉంటాయన్నారు. అకతాయిల సమాచారం ఇవ్వాలనుకుంటే 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు. బృందంలో ఎస్సైలు కుమారస్వామి, విద్యాసాగర్, స్వాతి, ఏఎస్సై వేణుగోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరేందర్, బీచ్యానాయక్, కానిస్టేబుల్స్ వంశీక్రిష్ణ, పూర్ణ ఉన్నారు.



ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాలి

కేయూ క్యాంపస్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటంఆడిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కమిటీ సభ్యులను అరెస్టు చేయకుండా అవినీతిపైన ప్రశ్నించిన కేయూ జేఏసీ నేతలపై కేసులు పెట్టించిన వీసీ, రిజిస్ట్రార్‌లు తక్షణమే కేసులను ఉపసంహరించుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి, కేయూ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ మంద వీరస్వామి డిమాండ్ చేశారు. శనివారం కేయూ జేఏసీ నేతలను పరామర్శించిన అనంతరం కేయూ జేఏసీ అధ్యక్షుడు తూము నవీన్, చైర్మన్ తిరుపతియాదవ్‌లతో కలిసి మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ గేట్‌వద్ద తమ నిరసన తెలిపారు. కేసులను ఉపసంహరించుకుంటారో.. రాజీనామా చేస్తారో.. ఆలోచించుకోవాలన్నారు. యూనివర్సిటీలకు ఉన్న స్వయంప్రతిపత్తిని రాష్ట్ర ప్రభుత్వం, వీసీలు దెబ్బకొడుతున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణాలోని అన్ని యూనివర్సిటీల్లోని విద్యార్థి నాయకులను చైతన్యం చేసి రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీలను ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థి, నిరుద్యోగుకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే టీఎస్‌జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజనశక్తి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కల్లెపెల్లి ప్రశాంత్, బీసీ విద్యార్థిసంఘం ఇన్‌చార్జ్ నాగరాజు, వంశీ, మనోహర్, రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఓయూ, కేయూ జేఏసీ నేతలు

కేయూలో తరగతుల బహిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులపై అక్రమ కేసులు పెట్టారని నిరసిస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చిన విషయం విధితమే. అయితే శనివారం యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో తరగతులు జరుగుతుండగా బంద్‌లో భాగంగా ఆయా విభాగాల వద్దకు వెళ్లి ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ క్యాంపస్‌లోని ఫార్మసీ, ఫిజిక్స్, మ్యాథ్స్, బీపీఈడీ విభాగాల్లో తరగతులను బహిష్కరింపచేశారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మంద నరేష్‌ను అరెస్టు చేశారు. అనంతరం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువతకు అన్యాయం చేశారన్నారు. విద్యార్థిసంఘాల బాధ్యులపై పెట్టిన అక్రమ కేసులు వెనక్కితీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసనలో ఏబీఎస్ఎఫ్ నాయకులు మచ్చ పవన్‌కల్యాణ్, పంగిడిపెల్లి పవన్, మధుగౌడ్, హెచ్ భరత్, వినయ్, సాయిప్రదీప్, వెంకటేష్, కిరణ్ పాల్గొన్నారు.



కేయూలో నిరసన తెలుపుతున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

క్యాంపస్‌ను వీడని పోలీసులు

కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేసిన నేపథ్యంలో శనివారం కూడా క్యాంపస్‌లో పరిపాలన భవనంతోపాటు పలు చోట్ల పోలీసులు మోహరించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. కాగా, గత రెండు రోజులుగా పోలీసులు క్యాంపస్‌ను వీడకపోవడం గమనార్హం.

గేదెలు ఇచ్చే వరకు కదలం

నర్సంపేట/ఆత్మకూరు: నచ్చిన గేదెలను కొనుగోలు చేసి ఇచ్చే వరకు హర్యానా నుంచి తెలంగాణకు వచ్చేదిలేదని లబ్ధిదారులు మాదాసి సురేష్, గంగారపు లింగయ్య, పరికి కోర్నెలు, అన్నారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ అధికారుల మనసు కరగాలని కోరుతూ శనివారం లబ్ధిదారులు హర్యానాలో దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లబ్ధిదారులను హర్యానాలోనే వదిలేసి తిరుగు ప్రయాణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మినీ డైరీ ప్రాజెక్టు కింద దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిందని, అధికారుల కమీషన్ల కక్కుర్తితో పక్కదారి పడుతుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు సురేష్‌కుమార్, మాధవిలత, సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నచ్చిన గేదెలను కొనుగోలు చేయకుండా గత వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అధికారుల కమీషన్ల దాహానికి దళితులను బలి చేస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వేల్పుగొండ నర్సయ్య, మందపల్లి శ్రీనివాస్, మందపల్లి నర్సయ్య, కొమ్ము వెంకన్న, మన్నె మల్లయ్య, మాదాసి స్వామి, గిన్నారపు మైబు, తదితరులు పాల్గొన్నారు.



దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

పది నిమిషాల్లో గమ్యం చేరుతాడనగా..

డీసీఎం రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రాజేందర్ మృతదేహం

హసన్‌పర్తి: పదినిమిషాల్లో గమ్యస్థానం చేరుతాడనగా.. ఓ వ్యక్తిని డీసీఎం రూపంలో మృత్యువు కబళించింది. యాదాద్రి– ఆరెపల్లి జాతీయ రహదారిలోని పెగడపల్లి వద్ద శనివారం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన సతూరి రాజేందర్ (45)కు భార్య స్వరూప, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భార్యభర్తలు ఓ ప్రైవేట్ పాఠశాలలో వంట చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. స్వరూప ఇటీవల కూతుళ్లతో వరంగల్ జిల్లా పైడిపల్లిలోని తల్లిగారింటికి వెళ్లింది. ఈక్రమంలో భార్య పిల్లలను తీసుకొచ్చేందుకు రాజేందర్ దామెర నుంచి బైక్‌పై పైడిపల్లికి బయల్దేరాడు. ఈక్రమంలో జాతీయ రహదారిపై వెనుకవైపు నుంచి వస్తున్న డీసీఎం– బైక్‌పై నుంచి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో రాజేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. ఇదిలా ఉండగా.. రాజేందర్ మృతికి కారణమైన డీసీఎం యజమాని పరిహారం చెల్లించాలని రాజేందర్ బంధువులు డిమాండ్ చేస్తున్నారు. పరిహారం ఇప్పిస్తేనే మృతదేహాన్ని తీసుకెళ్తామని కుటుంబ సభ్యులు పట్టుపట్టడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

బావిలోపడి వ్యక్తి మృతి



యాదగిరి(ఫైల్)

వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లికి చెందిన ఓ వ్యక్తి బావిలో పడి మృతిచెందాడు. ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. గుళ్లపెల్లి యాదగిరి(58) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. సంవత్సర కాలంగా తాగుడుకు బానిసైన యాదగిరి గురువారం ఉదయం వాళ్ల బయటకు వెళ్లివస్తానని అమ్మకు చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వాకబు చేసి, శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో శనివారం గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో యాదగిరి మృతదేహంపైకి తేలి ఉన్నట్లు గుర్తించిన రైతు యాదగిరి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

లిమిట్ పెంచుతామని దోచేశారు..

- క్రెడిట్ కార్డు పేరుతో సైబర్ మోసం
- లబోదిబోమంటున్న బాధితుడు



ఖిలా వరంగల్: మొబైల్ ఫోన్‌కు ఓటీపీ పంపించి బ్యాంకు ఖాతాల్లో నగదు లాగేస్తున్న సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు రూటు మార్చారు. అమాయక ప్రజల ఖాతాలపై కన్ను వేశారు. సైబర్ నేరగాళ్లు ఓటీపీ, ఎస్ఎంఎస్ లేకుండానే ఎనీడెస్క్ యాప్ ద్వారా ఖాతాను పూర్తిగా ఖాళీ చేసిన ఘటన వరంగల్‌లో వెలుగుచూసింది. మార్చి 22న వరంగల్ కరీమాబాద్‌కు చెందిన మహమ్మద్ హైమద్ ఆలీకి పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి కాల్ వచ్చింది. మీకు క్రెడిట్ కార్డు ఉందా.. ఉంటే ఎంత లిమిట్ ఉంది.. అని అడిగారు. బాధితుడు కార్డుకు రూ.25వేలు లిమిట్ ఉందని చెప్పగా.. కార్డు లిమిట్ రూ.70వేలకు పెంచుతున్నామని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. లిమిట్ పెంచాలంటే మొబైల్ ప్లే స్టోర్ నుంచి ఎనీడెస్క్ యాప్ డౌన్‌లోడు చేసుకొమ్మని చెప్పారు. వారి మాటలు నమ్మిన బాధితడు మొబైల్‌లో ఎనీడెస్క్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఆ వెంటనే మొబైల్ సైబర్ నేరగాడు చేతిలోకి స్క్రీన్ తీసుకున్నాడు. ఖాతా వివరాలు నమోదు చేస్తున్నామంటూ బాధితుడిని నమ్మించారు. మొబైల్‌కు వచ్చిన ఐడీ నంబర్ చెప్పగానే హెచ్‌డీఎఫ్ బ్యాంకు ఖాతాలోని రూ.17,770 లాగేసుకున్నాడు. మొబైల్‌కు వచ్చిన మెసేజ్ చూసి ఖాతాలోని నిల్వ మాయమైందని గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ కార్యాలయానికి కాల్ చేసి బాధితుడు వివరాలు చెప్పాడు. కానీ, అప్పటికే ఖాతాల్లో డబ్బులు మాయమయ్యాయి. ఈక్రమంలో శనివారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

శివనగర్‌లో బైక్ చోరీ

ఖిలా వరంగల్: ఓ షాపు ఎదుట శుక్రవారం సాయంత్రం పార్క్ చేసిన టీ.ఎస్ 24 1764 నంబర్ హీరో గ్లామర్ బైక్ చోరీకి గురైంది. వరంగల్ 34వ డివిజన్ శివనగర్ ఏరియాలోని పల్లవి ఆస్పత్రి లేన్‌లో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శివనగర్‌కు చెందిన మన్నెం ఆదినారాయణ(48) శుక్రవారం రాత్రి పార్క్ చేసిన బైక్ శనివారం ఉదయం కనిపించేదు. దీంతో శనివారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

కూతుళ్లు భరోసా ఇచ్చినా..

- కుటుంబాన్ని ఇబ్బంది పెట్టలేక ఆర్‌ఎంపీ బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులే కారణం




జమాలుద్దీన్ (ఫైల్)

తొర్రూరు: 'నాన్నా.. మేము ఉద్యోగాలు చేసి అప్పులు తీరుస్తాం. మీరేమీ బాధపడొద్దు. ఎటువంటి అఘాయిత్యం చేసుకోవద్దు' అని ఇద్దరు కూతుళ్లు భరోసా ఇచ్చారు. అయినా అతని మనస్సు వినలేదు. అప్పులతో కుటుంబాన్ని ఇబ్బంది పెట్టొద్దని భావించిన ఓ ఆర్‌ఎంపీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం చోటుచేసుకుంది. అదనపు ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అర్వపల్లికి చెందిన ఎండీ జమాలుద్దీన్ (46) కొన్నేళ్ల క్రితం తొర్రూరుకు వచ్చి స్థిరపడ్డాడు. పట్టణంతో పాటు మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు మదీనా, రిజ్వానా ఉన్నారు. మదీనా డిగ్రీ పూర్తికాగా, రిజ్వానా ఇటీవల ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసింది. వారి విద్య, ఇంటి అవసరాల నిమిత్తం రూ.15లక్షల మేర అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు డబ్బుల కోసం ఒత్తిడి చేస్తుండడంతో తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో చావే శరణ్యమని తలచాడు. కుటుంబంతో సైతం పలుమార్లు ఈ విషయంపై తన ఆవేదనను వెల్లిబుచ్చగా తాము ఉద్యోగాలు చేసి అప్పులు తీరుస్తామని కూతుళ్లు భరోసానిచ్చారు. తీసుకున్న అప్పు, వడ్డీలు కట్టలేనని భావించి, కుటుంబాన్ని ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోనుంచి బయటికి వచ్చిన జమాలుద్దీన్ అర్ధరాత్రి వరకు కూడా తిరిగి రాలేదు. భార్య ఫోన్‌కు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు మెసేజ్ చేశాడు. ఆందోళన చెందిన భార్య పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. కుటుంబ సభ్యులు వెతకగా శనివారం ఉదయం స్థానిక వ్యవసాయ మార్కెట్ సమీపంలో విగతజీవిగా కనిపించాడు. మృతుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య గౌసియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'పత్తి' సాగులో జాగ్రత్తలు పాటించాలి

- శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌ప్రసాద్

స్టేషన్‌ఘన్‌పూర్: పత్తి పంట సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.రామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వరంగల్ వారి ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక 2022–23లో భాగంగా ×పత్తి పంట సాగులో మెలకువలు₹ అనే అంశంపై ఎస్సీ రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పత్తిని నీటి వసతి గల ప్రాంతాల్లో మే నెలాఖరులోగా వేయాలన్నారు. వానాకాలంలో జూన్ 15వ తేదీలోగా విత్తినచో అధిక దిగుబడులు వస్తాయని, జూలై 20 తర్వాత విత్తినచో దిగుబడులు తగ్గుతాయన్నారు. చెలక నేలలలో పత్తిని అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేస్తే ఎకరానికి 9 నుంచి 13 క్వింటాళ్ల పత్తి దిగుబడి పొందవచ్చన్నారు. పత్తిసాగుకు దుక్కిలో 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్‌నుగాని, 50 కిలోల డీఏపీని దుక్కిలో వేసుకోవాలన్నారు. యాసంగిలో పత్తి వేయొద్దని, అధిక చీడ పీడలు ఆశించడం కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గుతుందన్నారు. అనంతరం రైతులకు పత్తిసాగులో వాడే సస్యరక్షణ మందులను, జిగురు అట్టలను, నీటిలో కరిగే పోషకాలను ఉచితంగా అందించారన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రశాంత్, బి.మాధవి, డి.అశ్విని, డాక్టర్ బి.అనీల్‌కుమార్, స్థానిక సర్పంచ్ నాగరబోయిన మణెమ్మయాదగిరి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ కేశరాజు నరహరి, వార్డు సభ్యుడు పసుల రమేష్, దేశ్‌పాండే ఫౌండేషన్ టీమ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, జోగు కుమార్, జోగు థామస్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌ప్రసాద్